క్లుప్తంగా

మార్కెట్ భవనం పూర్తి చేయాలి



భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గోదావరిఖని: కూరగాయల మార్కెట్ భవనాన్ని పూర్తిచేయాలని లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని విఠల్‌నగర్‌లోని దూల్‌పేట్‌లో అసంపూర్తిగా ఉన్న కూరగాయల మార్కెట్ భవనాన్ని పరిశీలించి పూర్తి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు అల్లిపు తిరుపతి, నాయకులు బాజా వెంకటేశ్, కన్నం భానుచందర్, అఖిల్‌వర్మ, సాయిలు, సురేశ్, రాజయ్య పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు నీటి సౌకర్యం



శ్మశానవాటికను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మారం: మండలంలోని పలు గ్రామాల్లో నీటి వసతి లేని శ్మశానవాటికలకు నీటి సౌకర్యం కల్పించనున్నారు. ఇందులో భాగంగానే గురువారం జిల్లా అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు మండలంలోని నాయకంపల్లి, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని స్మశావాటికలను మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, డీఈఈ రాజ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా శ్మశానవాటికలకు నీటి సౌకర్యం కల్పించే అవకాశాలను పరిశీలించారు. వీరి వెంట స్థానిక ఎంపీడీవో భీమ జయశీల, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న కాలనీలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. మానేరు నుంచి సుల్తానాబాద్‌కు వచ్చే పైప్‌లైన్ పనులను గురువారం ఆమె పర్యవేక్షించారు. వర్షాకాలంలో పైపులైన్ లీకేజీ కాకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా నీటితోనే అనారోగ్యాల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మేనేజర్ అలీమోద్దీన్ ఉన్నారు.


సంకష్టహర చతుర్థి వేడుకలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో గురువారం సంకష్టహర చతుర్థి వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భార్గవశర్మ ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

ఎలిగేడు: వరంగల్‌లో 8వ తేదీన జరిగే ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభకు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శిలారపు పర్వతాలు, పెద్దపల్లి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ కోరారు. ఎలిగేడు మండలం రాములపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కోదాటి వెంకటరమణారావు అధ్యక్షతన పార్టీ మండల స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేయడంతోపాటు, రాష్ట్రంలో అధికారం దిశగా కృషిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు సురేశ్, కాంపెల్లి ప్రభాకర్, అడ్డగుంట తిరుపతిగౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, రాకేశ్‌యాదవ్, తిరుపతియాదవ్, గంగయ్య, సతీశ్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

8న గోదావరిఖనికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ 8న గోదావరిఖనికి రానున్నట్లు రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీలోని టీవీగార్డెన్‌లో 8న ఉదయం 11గంటలకు సభ ఉంటుందన్నారు. పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. సభకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కాశీపేట స్వామి, దేవునూరి సంపత్‌కుమార్, జనగామ మల్లేశ్, విజయగిరి రాము పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు

- నిధులున్నా.. నిర్మించడంలో నిర్లక్ష్యం
- నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్న వైనం
- త్వరగా సీసీరోడ్లు నిర్మించాలని 18వ డివిజన్ వాసుల వినతి



హనుమాన్ నగర్‌లో ఫీట్ ఎత్తులో ఉన్న మ్యాన్ హోల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ పరిధి అల్లూరు, హనుమాన్ నగర్ ఏరియాల్లోని సీసీరోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం సీసీరోడ్లు తవ్వి వాటిని తిరిగి పునర్ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత పాలకవర్గంలో సీసీ రోడ్లను తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశారు. మ్యాన్ హోల్ రోడ్డుకు ఫీట్ ఎత్తుగా నిర్మించడంతో అటు వైపు వెళ్లే వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నిధులున్నా.. చర్యలు శూన్యం

రోడ్డు సైడ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం నీటితో పాటు మురికి నీరు ఇళ్లలోకి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొంది. నిధులు ఉన్నప్పటికీ అధికారులు, కొత్త పాలకవర్గం మాత్రం కమీషన్ల కోసం పనులు చేపట్టడం లేదని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి. రోడ్డుపై వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. త్వరలోనే నిర్మిస్తామని చెప్పడం తప్ప ఎలాంటి పనులు చేపట్టడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సీసీరోడ్డు పనులు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



రాత్రివేళల్లో డ్యూటీకి వెళ్లి రావాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్డు తవ్వినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా ఇటువైపు రాలేదు. నాలుగేళ్లుగా సీసీరోడ్డు పునః నిర్మించడం లేదు. మా ఏరియాకు వాహనాలు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం.

– లక్ష్మీనారాయణ, అల్లూరు

త్వరలోనే సీసీరోడ్డు పనులు

ఇప్పటి వరకు డివిజన్ పరిధిలోని ఏరియాల్లో సీసీరోడ్ల పనులు పూర్తి చేశాం. మిగిలిన సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను మేయర్ నిధులు డివిజన్‌కు కేటాయించిన వెంటనే పనులను చేపడతాం. కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో కొంత ఆలస్యమైంది. త్వరలోనే సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేస్తాం.

– బాడె అంజలీ దేవి, కార్పొరేటర్, 18వ డివిజన్

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ సరికాదు



సూచనలు చేస్తున్న ఆర్‌ఐ స్రవంతి

జ్యోతినగర్: అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణం చేపట్టడం సరికాదని, వాటి తొలగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు రామగుండం మండల ఆర్‌ఐ స్రవంతి అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడు, ఐదో డివిజన్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు నిర్మాణాలు చేపట్టారని వచ్చిన సమాచారంతో గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించామని ఆమె తెలిపారు. అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో ఓ పార్టీకి చెందిన కొందరు నిర్మాణాలు వేసుకోగా స్థానికంగా ఉన్న కొంతమంది తమకు స్థలాలు కావాలని ఇరువర్గాల వారు ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకుని ఆక్రమించుకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని సూచించారు.

‘భవన నిర్మాణ కార్మికులకు తోడ్పాటు అందిస్తాం’



మాట్లాడుతున్న సీఐ జగదీశ్

సుల్తానాబాద్‌రూరల్: భవన నిర్మాణ కార్మికులకు పోలీసుల తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో గురువారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కార్మికులు కష్టమైన పనులు చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడే అవకాశాలున్నాయిని, ప్రతీ ఒక్కరు బీమా, లేబర్ కార్డ్ తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో మాట్లాడి ఇన్సూరెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సైలు విజేందర్, అశోక్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సాయిచంద్‌కు కళా సంఘాల నివాళి



నివాళి అర్పిస్తున్న కళాకారులు

కోల్‌సిటీ: ఉద్యమ గాయకుడు సాయిచందుకు గోదావరిఖనిలోని గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నివాళి అర్పించారు. పట్టణంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయిచందు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించినారు. కళా సంఘాల అధ్యక్షులు కనకం రమణయ్య, సోగాల వెంకటి, మాదరి శ్రీనివాస్, కాశిపాక రాజమౌళి, ఎల్వీ రావు, నాగుల శ్రీనివాస్, ధనసింగ్, మేకప్ అంజన్న, సిరిపురం శ్రీనివాస్, తీగల లక్ష్మీనారాయణ, యూసుఫ్, రాజమౌళి, సలిగంటి సంపత్ పాల్గొన్నారు.

బోనాల జాతర



బోనాలతో మహిళలు

మంథని: మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించారు. బోయిన్‌పేట నుంచి మహిళలు బోనాలతో పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

గోదావరిఖని: సివిల్ విభాగం కాంట్రాక్టు కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. మేషన్స్, కార్పెంటర్, ప్లంబర్, ఫిట్టర్, పంప్ ఆపరేటర్ హెల్పర్లకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. నాయకులు బి.అశోక్, ఎ.వెంకన్న, ఇ.కుమార్, డి.బుచ్చయ్య, శ్రీను, రాజు, ఓదెలు పాల్గొన్నారు.

పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర విజయవంతం చేయండి

మంథని: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వరంలో నిర్వహించనున్న పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్ కోరారు. ముత్తారం మండల మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. 16న ప్రారంభంకానున్న పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర 33 జిల్లాలను కలుపుకొని 31వ తేదీ వరకు అన్ని జిల్లాల్లోని ఉద్యోగులను సమీకరిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి భవాని, రాజిరెడ్డి, మదన్‌కుమార్, శ్రీధర్ ఉన్నారు.

సివిల్ సర్వీస్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 10లోగా చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి కోరారు. బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ,ఈబిసి డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 50 మందిని నేరుగా, 100 మందిని ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రవేశం పొందినవారికి రూ.5వేల విలువైన స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 040 27077929, 77803 59322 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎల్లంపల్లికి స్వల్పంగా వరద

రామగుండం: ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.93 టీఎంసీల నీరు ఉంది. పార్వతీ పంపుహౌజ్ నుంచి ఎత్తిపోతల ద్వారా 10,440 క్యూసెక్కులు, వరదరూపంలో 7,107 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న కాళేశ్వరం జలాల ఎత్తిపోతలు

ధర్మారం: మండలం నందిమేడారం నంది పంప్‌హౌజ్ నుంచి గురువారం కూడా రెండు మోటార్లతో కాళేశ్వరం జలాలను ఎత్తిపోస్తున్నారు. 6,250 క్యూసెక్కుల నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

✦సమస్యలు పరిష్కరించాలి

కమాన్‌పూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్ఎస్ఎఫ్ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజీద్ గురువారం ఎమ్మార్వీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులైనా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాల పంపిణీ చేయలేదని ఆరోపించారు.

✦కమాన్‌పూర్ ఎస్సైకి సన్మానం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపటిన బేతి రాములును కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజు, సత్యనారాయణ, ఉపసర్పంచ్‌లు సాగర్, సాయికుమార్, చంద్రమౌళి, కుమార్, సతీశ్ ఆటో ట్రాలీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

✦మైసమ్మకు పూజలు

రామగుండం: ఆషాఢమాసం గురువారం కావడంతో దారి మైసమ్మకు పూజలు చేస్తున్నారు. బసంత్‌నగర్ రైల్వేవంతెన, రామగుండం బైపాస్‌రోడ్డు, పెద్దచెరువు ప్రాంతాల్లో పూజలు చేశారు.

✦దళితులకు క్షమాపణలు చెప్పాలి

కమాన్‌పూర్: మంథనిలో జరిగిన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు మాట్లాడిన తీరు దళిత జాతిని అవమానించినట్లుగా ఉందని జెడ్పీచైర్మన్ దళిత జాతికి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్యాల తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

✦జునోసిస్ డే

గోదావరిఖనిటౌన్: జూనోసిస్ డే సందర్భంగా పట్టణంలోని అడ్డగుంటపల్లి శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి రామగుండం మగువ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మీవాణి హాజరై మాట్లాడారు. మానవులకు వ్యాపించే వ్యాధుల్లో 60శాతం అధికంగా జంతువుల నుంచే వ్యాపిస్తున్నాయని ఆమె తెలిపారు. హెచ్‌ఎం సూర్యదేవర జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦మాదిగ జేఏసీ డివిజన్ అధ్యక్షుడిగా శంకర్

మంథని: మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన బూడిద శంకర్‌ను మాదిగ జేఏసీ మంథని డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శంకర్‌ను నియమించినట్లు తెలిపారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్‌మూర్తి

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి మార్కండేయ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా బొట్ల లక్ష్మణ్‌మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా గురువారం జరిగిన పద్మశాలీ సంఘం సర్వసభ్య సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్‌మూర్తి, ఉపాధ్యక్షుడిగా సిరిపురం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బొట్ల సంపత్, సహాయ కార్యదర్శిగా మోర బుచ్చిరాములు, కోశాధికారిగా సిరుపరం వెంకటేశం, సహాయ కోశాధికారిగా దూస లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శిగా బొట్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

‘ఓట్లు మావి.. సీట్లు మీకా’



ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉష

పెద్దపల్లిరూరల్: బహుజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారినే అణగదొక్కేందుకు పాలకులు యత్నిస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి శివారు రంగంపల్లిలో బుధవారం మన ఊరు..మన ఉష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ‘ఓట్లు మావి..సీట్లు మీకా’ అని ప్రశ్నించారు. బహుజనులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో బడుగుల కోసం పనిచేసే బీఎస్పీకే అధికారం అప్పగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్, నర్ల గోపాల్, రియాజ్, అజీం, సాగర్, అన్వేష్, కొమురయ్య, రవికుమార్, మల్లేశం, కనకయ్య, రంగయ్య, రాహుల్ ఉన్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించండి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మంథని: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోతున్న తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని మంథని మండలం పుట్టపాక గ్రామస్తులు కోరారు. పుట్టపాక గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో వీరబ్రహ్మచారి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు స్వీకరించారు. పలువురు తమ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని పంట భూములు ఉన్నాయని ఎకరానికి రూ.50లక్షల నుంచి రూ.60లక్షల ధర పలుకుతుందని తెలిపారు. అలాగే రహదారి నిర్మాణంతో కోల్పోతున్న నివాస గృహాలు, కట్టడాలకు సరైన పరిహారం ఇప్పించాలని కోరారు. అలాగే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సర్పంచ్ రొడ్డ మమత శ్రీనివాస్, ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్, సంకేసి రవీందర్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సుల్తానాబాద్: సమ్మెలో పారిశుధ్య కార్మికులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెకు దిగారు. పెద్దపల్లిలోని అమర వీరులస్తూపం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. వేతనాల పెంపు ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు అంజయ్య, ఖాజా, తిరుపతి, ఓదెలు, కనకయ్య, రాజయ్య, శ్రీనివాస్, అశోక్, శారద, మల్లేశం, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సమ్మెలోకి కార్మికులు

జూలపల్లి: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గురువారం నుంచి కార్మికులు, కారోబార్లు సమ్మెకు దిగారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం ఏర్పాటు చేసి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. పురుషోత్తం, మధు, రాంచంద్రం, శంకర్, లచ్చయ్య, లింగయ్య, బాణయ్య ఉన్నారు.

కాంగ్రెస్ మద్దతు

కాల్వశ్రీరాంపూర్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పంచాయతీ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్షలో కాంగ్రెస్‌కు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల: గ్రామ పంచాయతీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు గురువారం నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి రత్నం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు సందర్శించారు. నాయకులు చిటికేసి ప్రభాకర్, పవన్, భరత్, శ్రీనివాస్, సారయ్య, తిరుపతి, రాజుకుమార్ పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేతతో తప్పని తిప్పలు



మూసివేసి ఉన్న పెద్దంపేట రైల్వే గేటు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట రైల్వేగేట్ వద్ద ట్రాక్ పునరుద్ధరణ పనులతో వారంరోజులుగా రైల్వేగేటు మూసివేయడంతో గ్రామీణ ప్రజలు తిప్పలు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా సమీపంలోనే భూగర్భ వంతెన ఉన్నప్పటికీ రైల్వేశాఖ వాహనాల రాకపోకలను అనుమతించకపోవడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వారంరోజులుగా పునరుద్ధరణ పనులు చేపడుతున్న రైల్వేశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై గ్రామప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రైల్వేగేటు పనులు పూర్తి చేసి శుక్రవారం సాయంత్రం వరకు తెరుస్తామని గ్రామ పంచాయతీకి రైల్వేశాఖ అధికారులు అందజేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ తెలిపారు.

బ్రహ్మగర్జన సభ విజయవంతం చేయండి

మంథని: బ్రహ్మ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో 9న హైదరాబాద్‌లో నిర్వహించే బ్రహ్మగర్జన సభను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి కోరారు. గురువారం మంథనిలోని సీలేశ్వర సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించారు.

సభకు తరలిరావాలి

కాల్వశ్రీరాంపూర్: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో 9వ తేదిన నిర్వహించనున్న బ్రహ్మగర్జన సభకు బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలిరావాలని బ్రాహ్మణ సేవాసంఘం కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల కోకన్వీనర్లు నిట్టూరి అంబరీష్ శర్మ, సువర్ణ రాజేందర్ శర్మ పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన అర్చక బ్రాహ్మణ సంఘం సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. బ్రాహ్మణ గర్జన నాయకులు మల్లోజుల శ్రీనివాస్ శర్మ, నందగిరి శ్రీనివాస్ శర్మ, వల్లూరి మహేశ్ శర్మ, సముద్రాల వెంకటాచారి, సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



మంథని: పూలమాల వేస్తున్న శంకర్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ వర్ధంతి గురువారం పెద్దపల్లిలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి నివాళి అర్పించారు. నాయకులు బిక్షపతి, రామచంద్రరెడ్డి, వెన్నం రవీందర్, బొంకూరు అఖిల్, పల్లె మధు, కడమంచి శివ, రాకేశ్, రామ్‌చరణ్, అభిలాష్, బన్నీ, దళిత సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంథని: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతి మంథనిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు వర్ధంతి నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, కాంగ్రెస్ నాయకులు మంథని సత్యం, ఇనుముల సతీశ్, జంజర్ల శేఖర్, ఎరుకల ప్రవీణ్, గోటికార్ కిషన్ ఉన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్ రావు వర్ధంతి గురువారం కాంగ్రెస్ అధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, నాయకులు రంగు సత్యనారాయణ, గాండ్ల మోహన్, సయ్యద్ అన్వర్, మల్యాల తిరుపతి, అప్సర్, శేఖర్ పాల్గొన్నారు.

‘ప్రజల సమస్యలపై పోరాడుతా’



ప్రజలతో మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై పోరాడుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో బ్రేక్ ఫాస్ట్ విత్ జీఎస్ఆర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడటంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. నాయకులు వెంకటేశ్, వేణుగోపాల్, సంపత్, అజయ్, శ్రీకాంత్, నరేశ్ ఉన్నారు.